క్లుప్తంగా

మోదీతో కరచలనం

అనంతగిరి: వికారాబాద్ బీజేపీ అభ్యర్థి నవీన్ కుమార్ శనివారం హైదరాబాద్‌లో జరిగిన నరేంద్రమోదీ సభకు నియోజకవర్గ ముఖ్యనాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వేదికపై కూర్చున్నారు. మోదీ ప్రసంగం అనంతరం వేదికపై ఉన్న బీజేపీ అభ్యర్థులను పరిచయం చేసుకోగా నవీన్‌కుమార్ సైతం అక్కడే ఉండి ప్రధానికి కరచాలనం ఇచ్చారు.

ఉద్యోగ బదిలీలు సహజమే

పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు రాజశేఖర్



సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దేముల్: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు సహజమేనని మండల పీఆర్టీయూ శాఖ అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. శనివారం పెద్దేముల్ బాలుర, ఇందూరు ఉన్నత పాఠశాలల్లో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు అక్కమదేవి, శాంతప్పలు బదిలీపై వెళ్లడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఆర్టీయూ నాయకులు వారిని ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థుల ఉన్నత చదువులకు కృషి చేసిన ఉపాధ్యాయులు బదిలీపై ఎక్కడికి వెళ్లిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. శాంతప్ప, అక్కమదేవీలు విద్యార్థుల కోసం ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, అంజయ్య, రాధకృష్ణతో తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ధన్యవాదాలు

అనంతగిరి: వికారాబాద్‌లో ఏకకాలంలో దళిత బంధు ఇస్తానని చెప్పిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలియచేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు పెద్ది అంజయ్య, అశోక్ తెలిపారు. ఈ మేరకు వారు వికారాబాద్ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వికారాబాద్ పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్ నియోజకవర్గ అభివృద్ధికి వరాల జల్లు కురిపించారని సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క దళిత కుటుంబాలు బీఆర్ఎస్‌కు ఓటు వేసి మెతుకు ఆనంద్ను గెలిపించాలని వారు కోరారు.

శనైశ్చరుడికి తైలాభిషేకం



మోమిన్‌పేట: మండలంలోని ఏన్కతలలోని శనైశ్చరస్వామికి ప్రత్యేక పూజలు, తైలాభిషేకం, అభిషేకాలు చేశారు. శనివారం శని త్రయోదశి కావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు. స్వామి వారికి అత్యంత ప్రీతిప్రదమైన నల్లనినువ్వుల నూనె, నల్లని దుస్తులతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హోమ గుండం, సప్తవృక్షాల చుట్టూట్ ప్రదక్షిణలు చేశారు. భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ అధికారులు తాగునీరు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

పెద్దేముల్: పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఒక్కరోజు విద్య బోధన చేశారు. డీఈఓ, ఎంఈఓ , హెచ్ ఎంలా మారి విద్యార్థులు పాఠశాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. నేటి బాలురే రేపటి పౌరులన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో శ్రమదానం

కుల్కచర్ల: స్వచ్ఛతతో ఆలయాలు ఆహ్లాదకరంగా ఉంటాయని కుల్కచర్ల మండల అయ్యప్పసేవాసమితి అధ్యక్షుడు పటోళ్ల వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అయ్యప్పదేవస్థానంలో అయ్యప్పమాలధారులు శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇల్లు, ఆలయాలు స్వచ్ఛత పాటించడంతో ఆహ్లాదకరంగా ఉంటాయన్నారు. 41రోజుల పాటుగా అయ్యప్పస్వాములు మాలధారణ చేసి ఆలయంలో నిష్ఠగా భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని అటువంటి ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న ఉద్దేశంతో స్వాములందరూ శ్రమదానం చేశారని తెలిపారు.

కేసీఆర్ గడీలో బానిసలు



తాండూరు: ప్రచారం చేస్తున్న అభ్యర్థి మనోహర్‌రెడ్డి



సాయిపూర్‌లో కాంగ్రెస్ శ్రేణులతో ఎన్నికల ప్రచారం



కుల్కచర్లలో ఇంటింటి ప్రచారం చేస్తున్న భీంరెడ్డి, మేఘనా రెడ్డి

- కాంగ్రెస్ పార్టీలోనే ప్రజాస్వామ్యం
- తాండూరుకు రోహిత్‌రెడ్డి చేసింది శూన్యం
- ప్రజల వద్దకు వచ్చే దమ్ములేకనే తప్పుడు ఆరోపణలు
- కాంగ్రెస్ పార్టీ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి

తాండూరు: బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీఎం కేసీఆర్ గడిలో బానిసలుగా ఉండటం కన్నా ప్రజాస్వామ్యం ఉన్న కాంగ్రెస్ పార్టీలోకి రావాలని తాండూరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని సాయిపూర్‌లోని వార్డుల్లో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. అనంతరం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్తను దేశ ప్రధానిని చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. రాజకీయాల్లో గౌరవం ప్రజా సేవ చేయాలన్నా కాంగ్రెస్ పార్టీ ఒక్కటే సరైన వేదిక అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్‌లు, పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. రూ.500లకు గ్యాస్ సిలిండర్, చదువుకొంటున్న 18 సంవత్సరాల బాలికలకు ఉచిత స్కూటీతో పాటు రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్‌లోని అంశాలను అమలు చేస్తామన్నారు. తాండూరు ప్రాంతంలోని యువతకు రెండు దశాబ్దాలుగా ఉద్యోగాలు ఇచ్చానన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే తాండూరు ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా మారుస్తానన్నారు. స్థానికంగా ఉద్యోగావకాశాలు వచ్చేలా పరిశ్రమలు అందుబాటులోకి వస్తాయన్నారు. త్వరలో తను తాండూరులో మరో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నానని తెలిపారు. అందులో తాండూరు ప్రాంత యువతకే తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. 5 ఏళ్ల క్రితం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని నమ్మబలికి ఎమ్మెల్యే అయ్యారన్నారు. అయితే, గెలిచాక యువతకు మొండిచేయి చూపించారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నీరజాబాల్‌రెడ్డి, పటోళ్ల రత్నమాల నర్సింహులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు బంటు వేణుగోపాల్ తదితరులున్నారు.



మోమిన్‌పేట: ఆరు గ్యారంటీలను వివరిస్తున్న మహంత్‌స్వామి

కేసీఆర్ మాటలు నమ్మొద్దు

అనంతగిరి: కేసీఆర్ జూట మాటలను ఎవరు నమ్మవద్దని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ పెండ్యాల అనంతయ్య అన్నారు. ఈ మేరకు శనివారం వికారాబాద్ పట్టణంలోని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ దళితులను మరోసారి మోసం చేసేందుకు కేసీఆర్ ప్రత్యేక హామీలు ఇచ్చి వెళ్లారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ సహకారంతో ఎస్సీ కార్పొరేషన్ కింద అనేక మంది దళితులకు లబ్ధి చేకూరి ఉందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పార్టీ నాయకులకు మాత్రమే దళితబంధు వచ్చిందని విమర్శించారు. కార్పొరేషన్ లోన్లు రాక ఏళ్లు గడుస్తున్నాయన్నారు. కేసీఆర్ ఇచ్చిన దళిత ముఖ్యమంత్రి హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. దళితులకు ఇస్తామన్న మూడెకరాల భూమి మాట ఏమైందని ప్రశ్నించారు. దళితులను కెసిఆర్ మోసం చేస్తూ ఓట్లు దండుకుంటున్నారని మండిపడ్డారు. దళితులందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు రావాలంటే కాంగ్రెస్‌కు ఓటెయ్యాలి

కుల్కచర్ల: యువత నిరుద్యోగ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు జంగయ్య అన్నారు. శనివారం కుల్కచర్ల మండలం పీరంపల్లి గ్రామంలో పోలింగ్ బ్యాలెట్ నమూనాతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఓటుహక్కు వచ్చిన యువకులు తమ భవిష్యత్తు బాగుపడాలంటే కాంగ్రెస్‌కు ఓటు చేయాలన్నారు. యువత ఆలోచించి ఓటు వేయాలని ఒక్క చిన్న తప్పు చేస్తే ఐదు సంవత్సరాలు బాధపడాల్సి వస్తుందని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అర్హులందరికీ పథకాలు

కుల్కచర్ల: నిరుపేదల అభివృద్ధి ఫలాలు పొంది ఆర్థికాభివృద్ధిని సాధించాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలో పరిగి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టీ.రామ్మోహన్ రెడ్డి తరఫున ఆయన కూమార్తె మేఘనా రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ నియంతృత్వ పాలనలో సంక్షేమ పథకాలు కొందరికి మాత్రమే పరిమితమైయ్యాయని ఆరోపించారు. నియంతపాలనకు ముగింపు పలకాలంటే ప్రజలందరూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. రుణమాఫీ చేస్తామని చెప్పినా కేసీఆర్ ఇంకా పూర్తిస్థాయిల రుణమాఫీ చేయని దుస్థితి నెలకొందన్నారు. ఇన్నిరోజులు గుర్తుకురాని పేదోడి ఇళ్లు ఎన్నికలు వచ్చేసరికి గృహలక్ష్మి అంటూ కొత్త రాగం అందుకున్నారని మండిపడ్డారు. మోసపూరిత మాటలు నమ్మితే మళ్లీ ఐదేళ్లు గోసపడాల్సి వస్తుందని చెప్పారు. డబ్బులు, మద్యానికి ప్రలోభాపడి మన ఓట్లు వారికి వేస్తే మన భవిష్యత్‌ను మనమే నాశనం చేసుకున్నట్లు అవుతుందని తెలిపారు. సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, మాజీ ఎంపీపీ అంజిలయ్య, నాయకులు జోగు వెంకటయ్య, కుమ్మరి స్వామి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

బంట్వారం: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శనివారం మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా వారిని సాదరంగా ఆహ్వానించి కాంగ్రెస్ కండువా కప్పారు. అనంతరం బస్వాపూర్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం పరితపించే ప్రసాద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. అవినీతి సొమ్ముతో ఓట్లను కొనేందుకు డబ్బు సంచులతో గ్రామాల్లో తిరుగుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డిని ఎక్కడికక్కడ అడ్డుకుని తరిమికొట్టాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బస్వాపూర్ నాయకులు ,గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

మోమిన్‌పేట: బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహంత్‌స్వామి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం మోమిన్‌పేటలో ఇంటి ంటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగ యువతతో ఆటలాడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పేపర్ లీకేజీ వల్ల సంవత్సరాల కొద్ది కోచింగ్‌లు తీసుకొని పరీక్షలు రాసిన యువత నిస్తేజానికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మాటలు నీటి మూటలుగా మిగిలాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను గెలిచిన తర్వాత కచ్చితంగా అమలు చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, అసిఫ్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లతో బీసీలకు అన్యాయం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ

పరిగి: బీజేపీ, బీఆర్ఎస్‌లు బీసీలకు పూర్తిగా అన్యాయం చేస్తున్నాయని బీసీల లెక్కలు తీసి వారికి చట్టసభలో బిల్లు పెడుతామన్న కాంగ్రెస్ పార్టీకి మా మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు శనివారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 52శాతం ఉన్న బీసీలకు అటు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని విధాల అన్యాయం జరుగుతుందన్నారు. గత 30 సంవత్సరాలుగా బీసీల కోసం ఆర్ కృష్ణయ్య పోరాటం చేస్తునే ఉన్నారని అన్నారు. తెలంగాణలో బీజేపీ బీసీ సీఎంను చేస్తామని చెప్పడం మంచిదే, కాని బీజేపీ బీసీలకు చేసింది ఏమిటో చెప్పాలన్నారు. బీసీలకు న్యాయం చేస్తామన్న కాంగ్రెస్ పార్టీకి బీసీలంతా ఒకేతాటిపై ఉండి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి హన్మంతుముదిరాజ్, బీసీ సంఘ నాయకులు చిన్న నర్సింహులు, ఆంజనేయులు, పాలాద్రి శ్రీను, మల్లేష్ శేఖర్,సంజీవ్‌కుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దేశవాళీ వరి రకంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వాసన్ సంస్థ సిబ్బంది

దౌల్తాబాద్: దేశవాళీ వరిరకం పంటసాగుపై రైతులకు శనివారం బిచ్చాల గ్రామంలో వాసన్‌సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసన్‌సంస్థ పీఓ అనిల్ మాట్లాడుతూ.. దేశవాళి వరిధాన్యం ఇక్కడి ప్రాంతంలో అధికంగా దిగుబడి వస్తుందన్నారు. ఆ బియ్యం తింటే ప్రోటీన్‌లు, కార్బోహైడ్రేట్స్ , విటమిన్‌లు అధికంగా ఉంటాయని ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కావునా రైతులు దేశవాళీ వరి పంటను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీపతిరెడ్డి, సిబ్బంది గోపాల్ నర్సింలు ఉన్నారు.

ముదిరాజ్‌లకు సముచిత స్థానం



అనంతగిరి: ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి

వికారాబాద్ అర్బన్: బీఆర్ఎస్‌లో ముదిరాజ్‌లకు సముచిత స్థానం ఉంటుందని, ముదిరాజ్‌ల ప్రధాన డిమాండ్లను కేసీఆర్ నెరవేరుస్తానందుకే కాసాని జ్ఞానేశ్వర్ బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు ముదిరాజ్ మహాసభ సంఘం నాయకులు శేఖర్, గోపాల్, పాండులు తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్ అందరూ కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు తెలుపడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ముదిరాజ్‌లు అన్ని పార్టీల్లో ఉన్నారని, ఏ పార్టీలో ఉన్నా ముదిరాజ్‌లు మంచి పదవుల్లో ఉండాలని ఆకాంక్షించారు. కానీ, ముదిరాజ్‌లు అందరూ ఒక పార్టీ వెంటే ఉన్నారని చెప్పడం సరైంది కాదన్నారు. ముదిరాజ్‌లను బీసీ–డి నుంచి బీసీ–ఏ లోకి మార్చే ఆలోచన కేసీఆర్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు లక్ష్మణ్ ఇతర ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఆదరించాలి

అనంతగిరి: సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ అని వికారాబాద్ ఎంపీపీ చంద్రకళ, మండల పార్టీ అధ్యక్షుడు కమాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండలంలోని పులుసుమామిడిలో ఎమ్మెల్యే సతీమణి సబితానంద్‌తో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎక్కడ లేని పథకాలు తెలంగాణలో ఉన్నాయన్నారు. నేడు ప్రతి ఇంటికి పథకం అందుతున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నర ఏండ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే కారుకు ఓటేయాలి

కుల్కచర్ల: కారు గుర్తుకు ఓటేస్తే పథకాలు ఇంటికి వస్తాయని సొసైటీ డైరెక్టర్ కొండయ్య అన్నారు. శనివారం మండలంలోని సాల్విడు గ్రామంలో కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల మాయమాటలు విని ఓటేస్తే మళ్లీ కష్టాలు తప్పవని సూచించారు. ప్రస్తుతం ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా ప్రభుత్వం నుంచి నేరుగా లబ్ధిదారులకు పథకాలు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళారులు రాజ్యం ఏలుతారని విమర్శించారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

పెద్దేముల్‌లో పోటాపోటీగా ప్రచారం



పెద్దేముల్: కందనెల్లితండాలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

పెద్దేముల్: మండలంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రచారం జోరందుకుంది. నువ్వా నేను అన్నట్లు నాయకులు గడపగడపకూ వెళ్లి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. శనివారం పెద్దేముల్ మండల కందనెల్లి, పెద్దేముల్, రుక్మాపూర్, మంబాపూర్, తట్టెపల్లి, నాగులపల్లితో పాటు పలు గ్రామాల్లో నాయకులు ప్రచారం చేశారు. తమ అభ్యర్థులకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలు తప్పకుండా అమలు చేస్తుందని భరోసా కల్పింస్తునారు.



పెద్దేముల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం

నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్సే గెలుస్తుంది

- తెలంగాణలోనూ అండగా నిలవండి
- ఎంపీ నాసిర్ హుస్సేన్, సీఎల్‌పీ నేత షకీల్ అహ్మద్



అనంతగిరి: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి, రామేశ్వర్

అనంతగిరి: ఇప్పటివరకు ఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని, తెలంగాణలో సైతం ముస్లింలు కాంగ్రెస్‌కు అండగా నిలిస్తే ఇక్కడ కూడా అధికారంలోకి వస్తుందని కర్నాటక రాజ్యసభ సభ్యుడు నాసిర్, హుస్సేన్, బీహర్ సీఎల్‌పీ నేత షకీల్ అహ్మద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి వికారాబాద్ పట్టణంలోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో వికారాబాద్ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ముస్లింలకు ఇబ్బందులు కలిగే ఏ చట్టాలు చేసినా బీఆర్ఎస్ అండగా నిలిచిందని మండిపడ్డారు. ఆ పార్టీ ముస్లింలను కేవలం ఓటు బ్యాంకులా వాడుకుంటుందన్నారు. 12 శాతం రిజర్వేషన్‌ల విషయం ఏమయయ్యిందని వారు ప్రశ్నించారు. తొమ్మిదిన్నర ఏళ్లలో ముస్లింలకు అండగా నిలవని కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. డిల్లీలో మోడీతో ములాఖత్ అయ్యే కేసీఆర్ ఇక్కడ ఓట్ల కోసం దొంగ నాటకాలు ఆడుతారని మండిపడ్డారు. కర్నాటలో కాంగ్రెస్‌కు ముస్లింలు అండగా నిలవడంతో అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ ఒక్కటేనని వారు ఆరోపించారు. వికారాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రముఖ సంఘ సేవకులు నవాబ్ మహబూబ్ ఆలంఖాన్ మాట్లాడుతూ.. ఇలాంటి పరిస్థితుల్లో మనం కాంగ్రెస్‌కు అండగా ఉండాలన్నారు. ముస్లింల ప్రయోజనాలను కాంగ్రెస్సే కాపాడుతుందన్నారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి జాఫర్ తెలుగులో చేసిన ప్రసంగం ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ, పార్టీ అభ్యర్థి ప్రసాద్‌కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎర్రవల్లి జాఫర్, వహిద్ మియా, జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, సీనియర్ మైనార్టీ నాయకులు సర్ఫరాజ్, హాజీ, ఇక్బాల్, ఖాలెద్, ఫక్రోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌కుమార్ గెలుపు ఖాయం

మర్పల్లి: ఈ నెల 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్ గెలవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్ కొండల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కొంషెట్‌పల్లి, మర్పల్లి, పట్లూర్, బిలకల్ గ్రామాల్లో ఆ పార్టీ సీనియర్ నాయకులు జీ. సుభాష్‌యాదవ్, రామేశ్వర్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ ఎన్నికల ప్రచారం చూస్తుంటే రాష్ట్రంలో 70 నుండి 80 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుపొంది అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. వికారాబాద్ నియోజక వర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థి మాజీ మంత్రి జీ ప్రసాద్‌కుమార్ 10 వేల పై చిలుకు మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. గత 10 సంవత్సరాల నుండి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఏలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. కేసీఆర్ దళితుల ఓట్లు దండుకొనేందుకు సాధ్యం కానీ హామీలు ఇస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు జీ సుభాష్‌యాదవ్, పంచలింగాల సురేష్, పట్లూర్ సురేష్‌లు తదితరులు ఉన్నారు.

పులి కాదు హైనా



అడుగులు పరిశీలిస్తున్న అధికారులు

ధారూరు: ధారూరు గ్రామంలోని లక్ష్మమ్మ గుడి వద్ద కనిపించింది పులికాదు, హైనా అని ఫారెస్ట్ బీట్ అధికారి నరేష్ స్పష్టం చేశారు. స్థానికుల వివరాల ప్రకారం.. శనివారం ధారూరు గ్రామానికి చెందిన కమ్మరి విజయలక్ష్మి లక్ష్మమ్మగుడి సమీపంలో పులిని చూశానని భయంతో పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పింది. దీంతో గ్రామస్తులు అక్కడికి వెళ్లి చూడగా పులిజాడ కనిపించలేదు. పులి కుమ్మరి వాగు వైపే వెళ్లి ఉండవచ్చు అని అనుమానం వ్యక్తం చేశారు. ఈ సంఘటనతో చుట్టుపక్కల గ్రామ ప్రజలు అటువైపు తిరిగే రైతులు భయాందోళన చెందారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారి నరేష్ అడుగుల నమూనాలను పరిశీలించి పులికాదు హైనా అని చెప్పారు.

తాండూరు బిడ్డకు అవకాశం ఇవ్వండి

జెడ్పీటీసీ ప్రమోదిని

యాలాల: తాండూరు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి రోహిత్‌రెడ్డి అని ఎమ్మెల్యే తల్లి, వికారాబాద్ జెడ్పీటీసీ ప్రమోదిని అన్నారు. శనివారం మండల పరిధిలోని హాజీపూర్, కృష్ణాపూర్, సంగెంకుర్దు, దేవనూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా హాజీపూర్ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆమెకు బోనాలు, కుర్వ డోలు సంప్రదాయాల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తాండూరు అభివృద్ధికి ఏకకాలంలో రూ.134 కోట్లు సీఎం కేసీఆర్ నుంచి ప్రత్యేకంగా సాధించుకు వచ్చాడని చెప్పారు. ప్రతి పంచాయతీకి రూ.50 లక్షలు కేటాయించి, రికార్డు సృష్టించిన వ్యక్తిగా గుర్తింపు పొందాడని తెలిపారు. మరో మారు రోహిత్‌రెడ్డికి అవకాశం కల్పిస్తే మరిన్ని నిధులు సాధించి వందశాతం కృషి చేస్తాడన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, జెడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ ఎంపీపీ పురుషోత్తంరావు, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, సర్పంచ్‌లు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, శ్రీలత, శివకుమార్, ఏఎంసీ డైరెక్టర్ మంత్రి వెంకటయ్య, మాజీ డైరెక్టర్ కృష్ణ, యువజన విభాగం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు ఉన్నారు.



యాలాల: ప్రచారం మాట్లాడుతున్న ప్రమోదిని



పాడె మోస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బాధితులను ఆదుకుంటా

బషీరాబాద్: మొయినాబాద్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ నేతల అంత్యక్రియల్లో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. మృతుల పాడె మోసి, బాధిత కుటుంబాలను ఓదార్చారు. రమేశ్, లక్ష్మణ్ మృతి తమ పార్టీకి తీరని లోటన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.